సాక్షి ఖమ్మం

మంగళవారం । 5 । మార్చి । 2024



రాయితీపై కవర్లు!

మామిడికాయలపై మచ్చలు పడకుండా నిగనిగలాడేలా ఉండేందుకు ఉపయోగించే కవర్లను రాయితీపై ఇస్తున్నారు. 8లో



నూరు శాతం ఉత్తీర్ణత..

పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని డీఈఓ సోమశేఖర శర్మ ఉపాధ్యాయులకు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయమే ఎండ ప్రభావం మొదలవుతుంది. ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్నం గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

ప్రారంభమైన ఇంటర్ 'స్పాట్'



అధ్యాపకులకు సూచనలు చేస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) సోమవారం ప్రారంభమైంది. ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాంప్ ఏర్పాటుచేయగా, తొలిరోజు సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం మొదలుపెట్టారు. ఈమేరకు 32మంది అధ్యాపకుల్లో 24 మంది హాజరు కాగా ఒక్కొక్కరు రోజుకు 30పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. ఈసందర్భంగా క్యాంప్‌ను డీఐఈఓ కె.రవిబాబు పరిశీలించి అధ్యాపకులకు సూచనలు చేశారు.

బెంగళూరు ఉద్యాన ప్రదర్శనకు రైతులు



బెంగళూరు వెళ్తున్న రైతులతో అధికారి అనసూయ

ఖమ్మంవ్యవసాయం: కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఉద్యాన ప్రదర్శనలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 50 మంది రైతులు సోమవారం బయలుదేరారు. రైతులు వెళ్తున్న బస్సును జిల్లా ఉద్యానాధికారి జి.అనసూయ ప్రారంభించి మాట్లాడారు. బెంగళూరు ఉద్యాన ప్రదర్శనలో మేలైన కొత్త రకం వంగడాలు, సాంకేతిక సలహాలు, మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారులు ఏ.వేణు, జి.నగేష్, రైతు ప్రతినిధులు నల్లమల వెంకటేశ్వరరావు, వీరబాబు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్‌ఎం) ఎంపిక పరీక్ష ఈ నెల 11న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు స్తంభం ఎక్కే పరీక్ష ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు పోస్టు ద్వారా సమాచారం ఇవ్వడమే కాక, జాబితాను సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించామని తెలిపారు.

ఆర్టీసీ 'దసరా' విజేతల ఎంపిక

ఖమ్మం మామిళ్లగూడెం: దసరా పండుగ సందర్భంగా గత ఏడాది అక్టోబర్ 18నుండి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి విజేతలను సోమవారం ఎంపిక చేశారు. అప్పట్లో బస్సుల్లో ప్రయాణించిన వారు డిపోల్లో ఏర్పాటుచేసిన బాక్సుల్లో టికెట్లు వేయగా, వాటిని ఖమ్మం కొత్త బస్టాండ్‌కు తీసుకొచ్చి రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ప్రయాణికులతో డ్రా తీయించారు. విజేతలుగా టి.మణి(సత్తుపల్లి), పి.సింధు, బి.సమ్మక్క(భద్రాచలం), రాజరాజేశ్వరి(నర్సంపేట), సీహెచ్.నాగమణి(మహబూబాబాద్) నిలవగా మరో ఐదుగురు పురుషులు కూడా ఎంపికయ్యారు. వీరికి బహుమతులు అందించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆర్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్, సీఐలు రామయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మళ్లీ లైబ్రరీ బాట..!



ఖమ్మం సెంట్రల్ లైబ్రరీలో సిద్ధమవుతున్న నిరుద్యోగులు

జిల్లా గ్రంథాలయంలో నిరుద్యోగుల రద్దీ

- ఉద్యోగ నోటిఫికేషన్లతో పెరుగుతున్న అభ్యర్థులు
- మారుమూల ప్రాంతాల నుంచి ఖమ్మంకు మకాం
- రోజంతా లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ

ఖమ్మంగాంధీచౌక్: ఏ ఉద్యోగాలకు ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుంది.. పరీక్ష నిర్వహించాక నియామకాలకు వెళ్తుందా, మధ్యలో రద్దు చేస్తారా.. ఇలాంటి సంశయాలతో ఇన్నాళ్లు ఎదురుచూసిన నిరుద్యోగులు మళ్లీ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గతంలో పరీక్షలు పూర్తయిన ఉద్యోగాల ఫలితాలు వెల్లడించడమే కాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్- 1 నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఇవే కాక దాదాపు 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో నిరుద్యోగులు మళ్లీ గ్రంథాలయం బాట పట్టారు. జిల్లా నలుమూలల నుంచే కాక భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులు ఖమ్మంకు మకాం మార్చి అద్దె గదుల్లో ఉంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా లైబ్రరీలో గడుపుతున్నారు. దీంతో కొన్నాళ్లు బోసిపోయి కనిపించిన గ్రంథాలయం మళ్లీ కళకళలాడుతోంది.

500 మందికి పైగానే..

ఉద్యోగాల అన్వేషణలో ఉన్న దాదాపు 500 మంది నిరుద్యోగులు లక్ష్యసాధన కోసం నిత్యం ఖమ్మం గ్రంథాలయానికి వస్తున్నారు. కొందరు మధ్యాహ్న భోజనం బాక్స్‌లతో సహా వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకుంటున్నారు. డిగ్రీ, పీజీ, బీఈడీ, బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన వారు తమకు అర్హత ఉన్న ఉద్యోగాలు సాధించేందుకు కసరత్తు ప్రారంభించారు.



లైబ్రరీలో చెట్టు కింద చదువుకుంటున్న అభ్యర్థి

ఖమ్మంలో అద్దె గదులు

ఖమ్మం కేంద్ర గ్రంథాలయంలో అన్ని పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులు పలువురు ఇక్కడకు మకాం మార్చారు. ఖమ్మం వాసులే కాక భద్రాచలం, మణుగూరు, పినపాక, గుండాల, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట ప్రాంతాల నుంచి నిరుద్యోగులు సైతం ఖమ్మంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

ఈ సౌకర్యాలు కూడా కల్పిస్తే...

పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకు వస్తున్న నిరుద్యోగుల సంఖ్యకు అనుగుణంగా లైబ్రరీలో సౌకర్యాలు లేవు. కేంద్ర గ్రంథాలయానికి ఆనుకుని ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం ఇటీవల కూలిపోయింది. దీంతో సెంట్రల్ లైబ్రరీకి సంబంధించిన టాయిలెట్లను కూడా తొలగించారు. అయితే, ప్రభుత్వం ఉద్యోగాలకు వరుస నోటిఫికేషన్లు ఇస్తుండడంతో లైబ్రరీకి నిరుద్యోగుల తాకిడి పెరిగింది. కానీ టాయిలెట్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నందున అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఉద్యోగాలకు కేరాఫ్

నిరుద్యోగుల కోసం అన్నిరకాల పుస్తకాలు ఉండడంతో ఖమ్మం లైబ్రరీలో చదువుకున్న పలువురు ఉద్యోగాలు సాధించారు. దీంతో ఉద్యోగులను అందించేదిగా ఖమ్మం కేంద్ర గ్రంథాలయానికి పేరుంది. ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారు వివిధ హోదాల్లో స్థిరపడ్డారు.

వేలాది పుస్తకాలు

నిరుద్యోగులకు ఖమ్మం కేంద్ర గ్రంథాలయం విజ్ఞాన గనిగా బాసిల్లుతోంది. చదువుకునే విద్యార్థులకే కాక ఉద్యోగాన్వేషణలో ఉన్న వారికి కావాల్సిన వేలాది పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. గ్రూప్స్, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్, పోలీస్, ఫారెస్ట్, పంచాయతీరాజ్, విద్య, వైద్యం తదితర రంగాలకు చెందిన ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షల పుస్తకాలు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ బాషల్లో ఉండడంతో అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నా..



ఉదయం 8గంటలకే లంచ్ బాక్స్‌తో గ్రంథాలయానికి వస్తున్నా. రాత్రి 7గంటల వరకు చదువుకుని గ్రామానికి వెళ్తాను. గ్రూప్–1 పరీక్షల కోసం ఇక్కడ ప్రిపేర్ అవుతున్నాను. పోటీ పరీక్షలకు అనుగుణంగా మరిన్ని పుస్తకాలు సమకూరిస్తే బాగుంటుంది. – పి.రాజేష్, పిండిప్రోలు

డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా..



ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసిన నేను ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గ్రంథాలయానికి వస్తున్నా. ఇక్కడ అవసరమైన పుస్తకాలన్నీ ఉండగా.. ఇతర అభ్యర్థులతో చర్చిస్తూ సిద్ధమవుతున్నా. – కె.యమున, ఎం.వెంకటాయపాలెం

అవినీతిని ఉపేక్షించేది లేదు..



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తదితరులు

- సత్తుపల్లి అభివృద్ధికి పెద్దపీట
- అధికారులు పాత పద్ధతులు విడనాడాలి
- నియోజకవర్గస్థాయి సమీక్షలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: 'అధికారపక్షం, ప్రతిపక్షమే కాక అధికారులకు సైతం ఇదే ప్రభుత్వం.. నిబంధనలు అందరికీ వర్తిస్తాయి.. కుంటిసాకులతో ప్రభుత్వ పథకాలను తొలగించినా, అవినీతికి పాల్పడినా ఇంటికి పంపిస్తాం.. అధికారులు పాత పద్ధతులకు స్వస్తి పలికి ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధిలో పాలు పంచుకోవాలి' అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన సోమవారం నియోజకవర్గ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ ఏ అధికారిపైనా తమకు కోపం లేదని, ప్రజలు ఆశించిన మేరకు పాలన సాగిస్తే అందరికీ మంచిదని చెప్పారు. ఈ నియోజకవర్గంలోనే తన సొంత గ్రామం ఉన్నందున నిధుల కేటాయింపులో పెద్దపీట వేస్తామని తెలిపారు. కల్లూరు, పెనుబల్లి ప్రభుత్వాస్పత్రులకు వైద్యులు, సిబ్బంది ఖమ్మం నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే సమాచారం ఉందని, ఇకనైనా వారు మకాం మార్చకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సత్తుపల్లి వంద పడకల ఆస్పత్రిలో అవసరమైన అభివృద్ధి పనులకు రూ.2.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

తిరస్కరిస్తే సరైన కారణం ఉండాలి

కల్లూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు మాట్లాడుతున్నప్పుడు తహసీల్దార్లు ఎవరెవరు వచ్చారో పిలవండి అని మంత్రి సూచించగా.. అందరూ ధరణి దరఖాస్తుల పరిశీలనకు వెళ్లారని బదులిచ్చారు. దీంతో వారు లేకపోతే సమస్యలు ఎలా చెపుతారని మంత్రి అనడంతో సమావేశం ముగిసే లోగా తహసీల్దార్లను పిలిపించారు. కాగా, ధరణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, రూపాయి అవినీతికి పాల్పడినా, సరైన కారణం లేకుండా దరఖాస్తులు తిరస్కరించినా చర్యలు ఉంటాయన్నారు. పెనుబల్లి మండలం తాళ్లపెంట, రామచంద్రాపురం, ఏరుగట్ల భూసమస్యలను పరిష్కరించాలని సూచించారు. చెరువుశిఖం భూములు కబ్జా అవుతుంటే ఇరిగేషన్ శాఖ అధికారులు నిద్రపోయారాఅని ప్రశ్నించారు. వేంసూరు మండలం భీమవరం, కందుకూరు, తల్లాడ మండలాల్లో ప్రభుత్వ భూమి కబ్జా జరగకుండా ట్రెంచ్ కొట్టాలని ఆదేశించారు. ఇక నాగార్జునసాగర్ లిఫ్ట్‌ల పరిస్థితిపై ఆరా తీయగా ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్‌కుమార్ అసంపూర్తి సమాధానం చెప్పడంతో పడికట్టు పదాలతో కాకుండా ఊరు పేర్లతో సహా జాబితా తెలిసి ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచన మేరకు పనులు చేయాలని, కావాల్సిన నిధులు ఇస్తామని తెలిపారు. ఆర్ఓఆర్ పట్టాదారులను అటవీశాఖ ఉద్యోగులు ఇబ్బంది పెట్టొద్దని చెప్పారు. పాత ఎన్టీఆర్ కాల్వ భూమి తిరిగి ఇప్పించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తిపై రాష్ట్ర అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అలాగే, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సదాశివకుమార్‌ను ఆదేశించిన మంత్రి.. తల్లాడ మండలం నారాయణపురం, ఎన్టీఆర్‌నగర్‌ల్లో మురుగునీటి సరఫరా, గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపిక, కల్లూరు మండలం పెద్దకోరుకొండిలో సబ్‌స్టేషన్ నిర్మాణంపై సూచనలు చేశారు.

ఇళ్ల మరమ్మతు బాధ్యత సింగరేణిదే..

బాంబు పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను బాగు చేయించాల్సిన బాధ్యత సింగరేణిదేనని మంత్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లకు అయ్యే ఖర్చు యజమానులకే ఇస్తే వారే మరికొంత వేసి బాగు చేయించుకుంటారని చెప్పారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సింగరేణి నిధులతో ఆర్ఓఆర్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క ప్రభుత్వ నిధులు తొలుత సత్తుపల్లికే ఇస్తామన్న హామీ మేరకు మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, మువ్వా విజయబాబు, బొర్రా రాజశేఖర్, తోట సుజలరాణి, ఎం.డీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు పాల్గొన్నారు.

మోడీకి హ్యాట్రిక్ అవకాశమే లేదు..

- పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఐదు స్థానాలతో ప్రతిపాదన
- ఏదైనా ఒక చోట పోటీకి అవకాశం
- సీపీఐ పార్లమెంటరీ సదస్సులో కూనంనేని సాంబశివరావు



సదస్సులో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశం అన్ని రంగాల్లో వెనకబడడానికి కారణమైన మోడీ మూడోసారి ప్రధాని అయ్యే అవకాశమే లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పార్టీ ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సదస్సు సోమవారం ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో కూనంనేని మాట్లాడుతూ రాముడు, మతం వేరని స్పష్టం చేశారు. రామభక్తులందరూ బీజేపీ కార్యకర్తలు కాదనే విషయాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ తెలుసుకోవాలన్నారు. మోడీ పాలనలో పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోగా, పాలకులు మాత్రం దేశ ఆర్థిక పరిస్థితిపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా, రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు హక్కులు కల్పించలేని మోడీ ఇంకా ఏం చేశారో చెప్పాలన్నారు. కాగా, తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడిందని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి స్థానాల్లో ఒకటి తమకు కేటాయించాలని కాంగ్రెస్‌కు ప్రతిపాదించామని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్నారనే వాస్తవాన్ని గ్రహించాలని, గెలుపోటములను బేరీజు వేసే క్రమాన కొన్నిసార్లు ఓట్లు తగ్గినా తమ పునాదులు బలంగానే ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేయక తప్పదని తెలిపారు. ఇక సీపీఐ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించి, రానున్న ఎన్నికల్లో మతోన్మాద ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను ఓడించాలని శ్రేణులకు సాంబశివరావు పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు పోటు ప్రసాద్, సాబీర్‌పాషా, నాయకులు మహ్మద్ మౌలానా, బి.అయోధ్య, దండి సురేష్, మిర్యాల రంగయ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

11న భద్రాద్రికి రేవంత్‌రెడ్డి

బూర్గంపాడు మండలంలో సభ ?



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

భద్రాచలం/బూర్గంపాడు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 11న భద్రాచలం రానున్నారు. ఈ మేరకు సోమవారం షెడ్యూల్ విడుదలైంది. భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి దర్శనం అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత బహిరంగసభ ఉంటుందని ప్రకటించినా.. వేదిక ఎక్కడ అనేది స్పష్టత రాలేదు. భద్రాచలంలో సీతారాములను దర్శించుకున్నాక బూర్గంపాడు మండలంలో జరిగే సభలో సీఎం మాట్లాడతారని సమాచారం. అలాగే, సీతారామప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిసింది. ఈక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం లక్ష్మీపురం, బూర్గంపాడు, మోరంపల్లిబంజరల్లో సభకు అనువైన స్థలాలను పరిశీలించారు.

నామాకే మళ్లీ!



నామా నాగేశ్వరరావు

- ఖమ్మం లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటన
- జిల్లా నేతల భేటీలో కేసీఆర్ వెల్లడి

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోసారి ఎంపీ నామా నాగేశ్వరరావు పేరునే పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. హైదరాబాద్‌లో సోమవారం పార్టీ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు ఎంపీగా రెండు సార్లు గెలిచారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయననే మరోమారు అభ్యర్థిగా ప్రకటించారు.

2009లో తొలిసారి..

2004 నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్న నామా నాగేశ్వరరావు 2009 ఎన్నికల్లో తొలిసారి టీడీపీ నుండి ఎంపీగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరిపై విజయం సాధించారు. ఆ తర్వాత 2014లోనూ టీడీపీ నుంచే పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ నుంచే 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. దీంతో ఆయనను బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేతగా ఎన్నుకున్నారు. కాగా, ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామానే మరోమారు ప్రకటించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల సోమవారం సంబురాలు జరుపుకున్నాయి.

స్వస్థలం బలపాల..

మహబూబాబాద్ జిల్లా బలపాలలో నామా ముత్తయ్య – వరలక్ష్మి దంపతులకు 1957 మార్చి 15న నాగేశ్వరరావు జన్మించారు. ఆయనకు భార్య చిన్నమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. నామా ఇప్పటికే రెండుసార్లు ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి గెలవగా మూడోసారి ఇదే స్థానం నుంచి పోటీకి దిగనున్నారు.

విప్లవ పార్టీల కలయికతో బలమైన ఉద్యమాలు

- తొలిరోజు 'యూనిటీ' మహాసభల్లో వక్తలు
- హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు



అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సుభాష్ దేవ్

ఖమ్మంమయూరిసెంటర్: ఫాసిజం పెరిగిన నేపథ్యాన, అన్ని దేశాల్లో సామ్రాజ్యవాదులు ప్రభుత్వాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నందున బలమైన ఉద్యమాల నిర్మాణానికి విప్లవ పార్టీల కలయిక అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీల విలీనం సందర్భంగా సోమవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో యూనిటీ మహాసభలు ప్రారంభమయ్యాయి. ప్రాంగణంలో అరుణ పతాకాన్ని సుభాష్ దేవ్ ఆవిష్కరించగా, మాస్‌లైన్ నాయకులు ప్రదీప్ ఠాగూర్, సుభాష్‌దేవ్, పోటు రంగారావు అధ్యక్షవర్గంగా నిర్వహించిన సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఆతర్వాత యూనిటీ మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ వడ్డేల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మూడు విప్లవ పార్టీల కలయిక అభినందనీయమని చెబుతూ, పార్టీల విలీనానికి కారణాలను వివరించారు. అనంతరం జర్మనీ ప్రతినిధి సుష మాట్లాడుతూ భారత్‌లో మారుతున్న పరిస్థితులను విశ్లేషిస్తూ మాస్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(మషాల్) కేంద్ర నాయకుడు టాక్కర్ కనాల్ మాట్లాడుతూ నిరంకుశ రాజ్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆతర్వాత శ్రీలంక, మొరాకో దేశాలతో పాటు తమిళనాడుకు చెందిన యూనిటీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మురుగేషన్ పరప్రామన్, సీపీఐ(ఎంఎల్) రెడ్ ఫ్లాగ్ నాయకులు పంపిన సందేశాలను సంజయ్ సింఘ్వీ వినిపించారు. అలాగే, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు పాడిన పాటలే కాక జర్మనీ దేశ ప్రతినిధి సుష పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో దేవతాశర్మ, కె.రమ, కే.జీ.రామచందర్, రిషి తదితరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న జర్మనీ ప్రతినిధులు

వేగంగా ధరణి దరఖాస్తుల పరిష్కారం

కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మంరూరల్: ధరణి దరఖాస్తు పరిష్కారానికి ఈనెల 1వ తేదీనుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈమేరకు అధికారులు రికార్డులు, ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయన ధరణి పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీసి పరిష్కారంపై సూచనలు చేశారు. నిర్దేశిత సమయంలోగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, ధరణి మాడ్యూల్స్ ప్రకారం పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, డీటీలతో కూడిన బృందం పర్యటిస్తే పరిష్కారం సులువవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలి

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మంలోని రాజేంద్రనగర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. ఎండల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రతీఒక్కరికి తనిఖీ చేశాకే లోపలకు అనుమతించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు అనుమతించొద్దని సూచించారు. కాగా,సోమవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరగగా, 19,954మంది విద్యార్థులకు గాను 19,001మంది హాజరు కాగా 953మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు వెల్లడించారు.

క్లుప్తంగా

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

వేంసూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని చౌడవరం, మర్లపాడు పాఠశాలల్లో సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కొందరు విద్యార్థులు వెనుకబడినట్లు గుర్తించిన ఆయన ప్రత్యేక తరగతుల సమయం మరికొంత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాగా, జిల్లాలో ఈ ఏడాది 16,514 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్.వెంకటేశ్వరరావు, హెచ్ఎం సత్యనారయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న శ్రీకృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత నిర్వహణను అప్పగించేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తెలిపారు. పీసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. పాటదారులు ఉదయం 11 గంటల్లోపు ధరావత్ సొమ్ము రూ.30 లక్షలు, సాల్వెన్సీ రూ.5లక్షలను డీడీ లేదా నగదు రుపేణా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఈనెల 11వరకు పోలీస్ యాక్ట్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 11వ తేదీ వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఈమేరకు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించొద్దని సూచించారు. అలాగే, పరిమితికి మించి శబ్దాలతో డీజేల ఉపయోగిస్తున్నట్లు అందిన ఫిర్యాదుతో అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపారు.

రెడ్‌క్రాస్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేసేలా సభ్యులు కృషి చేయాలని చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ కోరారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు అందించాల్సిన ఉచిత వైద్య సేవలపై చర్చించారు. అనంతరం సంఘ బలోపేతంపై చైర్మన్ సూచనలు చేశారు. ఈసమావేశంలో వైస్ చైర్మన్ ఆర్.రవీంద్రరావు, ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల సూర్యప్రకాశరావుతో పాటు డాక్టర్ విజయలక్ష్మి,సాదినేని జనార్దన్‌రావు, నరసయ్య, జెల్లా వెంకటేశ్వర్లు, తాతా రాఘవయ్య, నాగేశ్వరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దళారుల వ్యవస్థను అరికట్టాలి

ఎన్డీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులను దోచుకుంటున్న దళారీ వ్యవస్థను అరికట్టాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన సోమవారం మార్కెట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈమేరకు ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పంటను వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కాగా, తాము శాంతియుతంగా ధర్నా చేస్తుంటే ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించకుండా అరెస్టు చేయడం సరికాదన్నారు. అనంతరం అక్రమ అరెస్టుకు నిరసనగా మయూరిసెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ,ఏఐకేఎంఎస్ నాయకులు ఆవునూరి మధు, మందుల రాజేంద్రప్రసాద్, వెంకట్రాంరెడ్డి, వై.ప్రకాష్, ఐ.వెంకన్న, జి.రమేష్, వీ.వీ.రావు, మోహన్‌రావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,250	6,000
కందులు	9,050	9,050
మిర్చి	20,800	14,300
మిర్చి తాలు	12,000	8,000
పత్తి	7,400	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,045

రాయితీపై కవర్లు !

- మామిడి పండ్లు నిగనిగలాడేలా వినియోగం
- ఎకరాకు 5 వేల కవర్లకు 50 శాతం మేర రాయితీ
- దరఖాస్తు చేసుకునేందుకు రేపటి వరకు అవకాశం



కవర్ తొడగడంతో నిగనిగలాడుతున్న మామిడి పండ్లు (ఫైల్) కాయలకు కవర్లు తొడిగిన దృశ్యం



ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర ప్రభుత్వం మామిడి పండ్ల కవర్లను 50 శాతం రాయితీపై అందించేందుకు నిర్ణయించింది. చెట్టుపై మామిడి పండ్ల నాణ్యత దెబ్బతినకుండా, రాతి మంగు వంటి తెగుళ్ల బారిన పడకుండా ఈ కవర్లు ఉపకరిస్తాయి. అంతేకాక పక్షులు, కోతుల నుంచి రక్షణతో పాటు పండు ఈగ, కాయ తొలుచు పురుగు ఆశించకుండా, కాయ రక్షణకు దోహదం చేస్తాయి. కవర్లతో రక్షణ కల్పించిన పండ్లు నాణ్యంగా ఉండి ధర పలికే అవకాశం కూడా ఉంటుందని, రైతులకు ప్రయోజనం కలిగే విధంగా మామిడి పండ్ల కవర్లను ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందిస్తోంది.

ఖమ్మం జిల్లాకు 20.17లక్షల కవర్లు

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రాయితీలను అందిస్తుండగా, జిల్లాలో 404 ఎకరాలకు 20,17,500 కవర్లను కేటాయించారు. ఒక్కో కవర్ ఖరీదు రూ.2.60 కాగా, ఒక రైతుకు ఎకరాకు 5 వేల కవర్లను 50 శాతం రాయితీపై అందించేందుకు జిల్లా ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. అర్హత కలిగిన ఉద్యాన రైతులు తమ ప్రాంతాల్లోని ఉద్యాన అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

అధికారుల వివరాలిలా..

రైతులు కవర్ల కోసం సంప్రదించాల్సిన ఉద్యానవన అధికారుల సెల్‌ఫోన్ నంబర్లను ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇందులో పాలేరు నియోజకవర్గానికి సంబంధించి 79977 25129, ఖమ్మం నియోజకవర్గ రైతులు 79977 25128, మధిర నియోజకవర్గంతో పాటు కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, మండలాల రైతులు 79977 25127, వైరా నియోజకవర్గంతో పాటు సత్తుపల్లి, వేంసూరు మండలాల రైతులు 79977 25130 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఈనెల 6 వరకు దరఖాస్తుకు అవకాశం



మామిడి కవర్లను రాయితీపై పొందేందుకు ఈ నెల 6వ తేదీ వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. నాణ్యమైన మామిడి పంటను సాధించేందుకు కవర్లను వినియోగించాలి. కవర్లు వినియోగించి పండించిన పంటకు ధర లభించడంతో పాటు, ఎగుమతుల్లో కూడా మన్నికగా ఉంటాయి. రైతులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– జి.అనసూయ, ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

'కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్' ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న రామానుజ జీయర్ స్వామి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లు నందిని

ఖమ్మంగాంధీచౌక్: సాయి సిల్క్స్ కళా మందిర్ లిమిటెడ్(ఎస్ఎస్‌కేఎల్) తమ కార్యకలాపాలను విస్తృతం చేయడంలో భాగంగా కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ 59వ బ్రాంచ్‌ను ఖమ్మం బైపాస్ రోడ్డులో ప్రారంభించింది. అలాగే, కస్బాబజార్‌లో ఉన్న కళామందిర్ స్టోర్‌ను కాంచీపురం వరమహాలక్ష్మీ సిల్క్స్‌గా మార్చింది. ఈ స్టోర్స్‌ను త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి సోమవారం ప్రారంభించగా, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. అనంతరం సంస్థ యాజమానులు కల్యాణ్, ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో కార్యకలాపాలు నిర్వర్తిస్తుండగా తెలంగాణలో ఇది 26వ స్టోర్ అని తెలిపారు. దేశపు అతిపెద్ద చీరల మార్కెట్ కావడమే కాక పట్టు చీరల విక్రయాల్లో 50 శాతం వాటా కలిగిన దక్షిణ భారత మార్కెట్‌పై దృష్టి పెట్టాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను చేరుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

సత్తుపల్లిరూరల్: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య సూచించారు. సత్తుపల్లిలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మహిళా సంఘాల వారీగా సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాక తీసుకున్న రుణాలు, చెల్లించిన మొత్తం వివరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన సంఘాలకు రుణాలు ఇప్పించాలని సూచించారు. ఈసమావేశంలో ఏపీఎంలు కె.సుబ్బారావు, రామారావు, నాగ పుల్లారావు, చిన్న వెంకటేశ్వర్లు, బొమ్మా శ్రీనివాసరావుతో పాటు రత్నకుమారి, రామారావు, శ్రీనివాస్, కృష్ణయ్య, నరేందర్, సరోజిని, వెంకటపతిరాజు పాల్గొన్నారు.

ఉద్యాన క్షేత్రాల పరిశీలన



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

దమ్మపేట: దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిలోని ఉద్యాన క్షేత్రాలను కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్‌కుమార్ శాస్త్రవేత్తలతో కలసి సోమవారం సందర్శించారు. దమ్మపేట మండలం మందలపల్లి, అల్లిపల్లి, అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల, నారంవారిగూడెం, గుర్రాలచెరువు గ్రామాల్లో మామిడి, ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, జాజికాయ, అరటి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె.భాస్కర్, అశ్వారావుపేట హెచ్‌ఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ, రైతు నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కర్, కె.వి.సత్యనారాయణ, ఎర్రా వసంతరావు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మంస్పోర్ట్స్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 6న ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. 18నుంచి 35ఏళ్ల లోపు వయస్సు కలిగి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల్లో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూ లకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

చింతకాని: మహాశివరాత్రి సందర్భంగా చింతకాని మండలం నేరడలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకులు దూసరి శ్రీరాములు తెలిపారు. ఈనెల 8నుంచి మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు రూ.500తో ఎంట్రీలను ఈనెల 7లోగా పంపించాలని సూచించారు. పోటీల్లో మొదటి నుంచి తొమ్మిది స్థానాల్లో నిలిచిన వారికి రూ.45వేలు మొదలు రూ.5వేల వరకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పించనుండగా, వివరాల కోసం 70939 00119, 98483 95035, 96185 81507 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేకాధికారి తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలను సోషల్ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్, ట్రైకార్ జనరల్ మేనేజర్ కె.శంకర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన పరీక్షలకు సిద్ధమవుతున్న తీరుపై ఆరా తీశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున శ్రద్ధగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఐటీడీఏ డీడీ ఎస్.విజయలక్ష్మి, ఏటీడీఓ జహీరుద్దీన్, ఏసీఎంఓ డి.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బి.నామా నాయక్ తదితరులు ఉన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన ముగ్గురిపై కేసు

కామేపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జాస్తిపల్లికి చెందిన బొంత పూజితకు వరంగల్ జిల్లా ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన రంజిత్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. రెండు నెలలు బాగానే ఉన్న రంజిత్ ఆతర్వాత తన తల్లిదండ్రులతో కలిసి పూజితను అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా వేధిస్తున్నాడు. అంతేకాక ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టడంతో ఆమె చేసిన ఫిర్యాదు మేరకు భర్త రంజిత్, అత్తామామలు వెంకటమ్మ, మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై దాడి... పరిస్థితి విషమం

నేలకొండపల్లి: మహిళపై ఓ యువకుడు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోదులబండలో నెలవారీ పొదుపు డబ్బు చెల్లించే విషయమై పలువురు సోమవారం సమావేశమయ్యారు. ఇటీవల ఓ మహిళ హత్య కేసులో జైలుకు వెళ్లిన కుటుంబం కూడా డబ్బు చెల్లించాల్సి ఉంది. ఈక్రమంలోనే వారి బంధువులతో చర్చిస్తుండగా... గ్రామానికి చెందిన సుధాకర్ గ్రూప్ లీడర్ కుక్కల ఝూన్సీపై దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోగా నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

ఖమ్మం మామిళ్లగూడెం: పదో తరగతి విద్యార్థులకు ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ఫలితాలను సోమవారం విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 6వేల మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఖమ్మం త్రివేణి స్కూల్‌కు చెందిన ఏ.మోక్షిత, వైరా వాణివివేకానంద పాఠశాలకు చెందిన ఎస్.కే.షాహిద్, ఖమ్మం గీతాంజలి పాఠశాలకు చెందిన ఎస్.భవ్య మొదటి మూడు స్థానాల్లో నిలిచారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. వీరికి త్వరలోనే నగదు బహుమతులు అందజేయనన్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయుడి రిమాండ్

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం గిరిజన గురుకుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తెలుగు మార్కులు తక్కువగా వచ్చాయని విద్యార్థులను దండించిన ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావును పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. గత నెల 20న ఆయన 25 మంది విద్యార్థులపై విచక్షణారహితంగా కొట్టగా వాతలు తేలాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేయగా, సోమవారం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్.ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి: మండలంలోని భీక్యాతండా, లావుడ్యా తండా గ్రామాల్లో సోమవారం చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా నిల్వ చేసిన 35క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సివిల్ సప్లయిస్ డీటీ విజయ్‌బాబు తెలిపారు. భీక్యాతండాలోని వాంకుడోతు రాములు, వాంకుడోతు బన్సీలాల్, విజయతో పాటు లావుడ్యాతండాలోని భూక్యా రాందాస్, భూక్యా సాగర్, భూక్యా రాము ఇళ్లలో బియ్యం లభించాయని తెలిపారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ ఆర్ఐ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ ట్యాంకర్ బోల్తా



నడిరోడ్డుపై పడిన ట్యాంకర్

తల్లాడ: తల్లాడ మండలం పినపాక వద్ద సోమవారం పామాయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఈ ట్యాంకర్ రహదారికి అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో ట్యాంకర్‌ను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకుందాం..

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని జరుపుకుంటూ, మహిళలపై జరుగుతున్న అమానవీయ దాడులు, రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. మహిళలు పితృస్వామ్యం నుంచి విముక్తి కోసం కార్మికవర్గ విప్లవంలో సంఘటితం కావాల్సిన అవసరాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గుర్తుచేస్తోందని తెలిపారు. మహిళలు పీడన, శ్రమ దోపిడీకి గురవుతున్నందున అందులో నుంచి విముక్తి కోసం పోరాడాలని ఆజాద్ ఈ లేఖలో పిలుపునిచ్చారు.

మావోల కరపత్రాలు, బ్యానర్లు

ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని జరుపుకోవడమే కాక మణిపూర్ మహిళలపై జరిగిన అమానవీయ దాడులు, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడదామంటూ మావోయిస్టు పార్టీ కరపత్రాలు, బ్యానర్లు విడుదల చేసింది. ఆదివాసీ విప్లవ మహిళా సంఘం, విప్లవ మహిళా సంఘాల పేరుతో చర్ల మండలంలోని పలుచోట్ల కరపత్రాలు, బ్యానర్లు ఏర్పాటుచేశారు. పెట్టుబడిదారీ విధానాలు, పితృస్వామిక భావజాలాన్ని పెంచి పోషిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అందులో పిలుపునిచ్చారు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు వీటిని తొలగించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: మహిళను హత్య చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులకు జీవితఖైదు విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలం పొన్నెకల్లుకు చెందిన అనితకు అదే మండలం లింగయ్య తండాకు చెందిన బానోత్ నాగేశ్వరరావు అలియాస్ నగేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో పలుమార్లు గొడవలు జరగ్గా అనిత తన భర్తకు విడాకులు ఇచ్చింది. కొంతకాలం తర్వాత నాగేశ్వరరావును కూడా దూరం పెట్టగా, అతను అనుమానంతో పంచాయితీ పెట్టించాడు. నాగేశ్వరరావుకు పెద్దమనుషులు రూ.10వేలు జరిమానా వేయగా, అనిత చెప్పుతో కొట్టింది. అవమానాన్ని మనసులో పెట్టుకుని ఆమెను కడతేర్చాలని పథకరచన చేశాడు. ఇందుకోసం కారేపల్లి మండలం దుబ్బా తండాకు చెందిన బానోతు నరేష్, వాంకుడోతు సంకి, చీమలపాడుకు చెందిన పేరం లక్ష్మయ్యకు రూ.50 వేల సుపారీ ఇచ్చాడు. తొలుత రూ.10 వేలు చెల్లించాడు. ముందస్తు పథకం ప్రకారం 2017 నవంబర్ 18న నాగేశ్వరరావు అనితను తీసుకుని భద్రాచలం వెళ్లాడు. తాము భార్యాభర్తలమంటూ శ్రీకృష్ణ దేవాలయ సత్రంలో గది తీసుకున్నారు. అదే రోజు సుపారీ తీసుకున్న ముగ్గురు వ్యక్తులు కూడా సత్రంలో వారి పక్క గది తీసుకున్నారు. మరునటి తెల్లవారుజామున అందరూ వెళ్లిపోయారు. రూం శుభ్రం చేసేందుకు పని మనిషి వెళ్లగా అనిత బాత్రూంలో రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించింది. సత్రం లీజ్ యజమాని స్వరాబు రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు, సంకి, పేరం లక్ష్మయ్య, బానోత్ నరేష్‌లు అనితకు మద్యం తాగించి, కత్తితో పొడిచి హతమార్చినట్లు, ఆమె ఆభరణాలు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం నాగేశ్వరావు నాగేశ్వరరావు తల్లి బోడ ద్వాలి, భార్య లక్ష్మి సహా ఆరుగురిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. పదహారు మంది సాక్షులను విచారించాక నాగేశ్వరరావు అలియాస్ నగేష్, బానోతు నరేష్‌పై నేరం రుజువు కాగా జీవిత ఖైదు విధించడంతోపాటు చెరో రూ. 3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా విచారణ సమయంలో బోడ ద్వాలి మృతి చెందింది. మిగతా వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణ మూర్తి వాదనలు వినిపించగా, సిబ్బంది ఎస్.వీరబాబు, సుధీర్ సహకరించారు.

హత్యాయత్నానికి పాల్పడింది ఈ టీషర్ట్ యజమానే...



హత్యాయత్నం చేసిన వ్యక్తి టీషర్ట్

కొణిజర్ల: కొణిజర్లలో గత నెల 28న అర్ధరాత్రి కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి టీషర్ట్ ఘటనాస్థలిలో తమకు లభించిందని పోలీసులు తెలిపారు. ఘటనా సమయంలో చాలా సేపు రామారావు, సదరు వ్యక్తి పెనుగులాడినట్లు సీసీ టీవీ పుటేజీలో గుర్తించారు. ఈ మేరకు హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ధరించిన టీషర్ట్ ఊడిరాగా, పోలీసులు ఫొటో విడుదల చేశారు. ఇదెవరిదో తెలిసిన వారు 87126 59150 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వివరాలు చెప్పిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వాహనం అదుపు తప్పడంతో గాయాలు

పెనుబల్లి: అతివేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొత్తకారాయిగూడెంకు చెందిన నెల్లూరి బోధనాచారి ద్విచక్రవాహనంపైపై సోమవారం వీఎం బంజర్ వైపు వేగంగా వెళ్తుండగా తుమ్మలపల్లి వద్ద బైకు అదుపుతప్పి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ ఘటనలో చారికి తీవ్ర గాయాలు కాగా, పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.